కథ

# చేయూత

గొట్టిముక్కల శ్రీలలిత



'చేయూత' సేవాశ్రమం చుట్టూ పరిసరాలు ఎంతో ప్రశాంతంగా కన్పిస్తున్నాయి. ఏ టెన్షన్‌లో ఉన్నవారైనా ఈ ప్రాంతానికి వస్తే ఎక్కడ లేని స్వాంతన లభించేదిగా ఉంది. అక్కడి వాతావరణం, ఆశ్రమం చుట్టూ ఉన్న ప్రహరీ గోడ నిండా మంచి మంచి స్లోగన్లు బాగా చదివిస్తున్నాయి.

ఆ ఆశ్రమం చూడడానికి వచ్చిన పత్రికా విలేకరులు ఆశ్రమం స్వాగత ద్వారం వద్ద ఆగిపోయారు.

'వృద్ధాప్యం ప్రతి జీవికీ అనివార్యం. అయితే మానవులు వృద్ధాప్యంలో పడే ఇబ్బందుల దృష్ట్యా దాన్ని మనసారా ఆహ్వానించడానికి ఎవరూ సిద్ధంగా ఉండరు. ఈ ఆశ్రమం అలాంటి ఆహ్వానాన్ని ప్రతి ఒక్కరికీ అందిస్తుంది. వృద్ధాప్యం అంటే భయపడేవారికి కొండంత అండనిస్తుంది. తమ శేష జీవితాన్ని ఎంతో ఆనందంగా, సంతృప్తిగా గడిపేందుకు ఈ వాతావరణం దోహదం చేస్తుంది' అన్న వాక్యాలు పాత్రికేయుల్ని ఎంతగానో ప్రభావితం చేసాయి. కేవలం ఇవి అక్షరాలకే పరిమితమా, లేక ఇవి అక్షరసత్యాలా అని తెలుసుకోవడానికి కాస్త ముందుకెళ్ళారు వారంతా.

ఆశ్రమం లోపలికెళ్ళిన వారంతా అక్కడి వాతావరణానికి ముగ్ధులయ్యారు. ఏదో తెలియని ప్రశాంతత అక్కడ కన్పిస్తోంది. మళ్ళీ మళ్ళీ ఇక్కడకు రావాలని మనసు కోరుకుంటున్నట్టుగా ఉంది.

పాత్రికేయులంతా తమ కెమేరాలకు, వీడియోలకు పనిచెప్పారు.

****

ఉత్తమ సేవకు గాను ఈ ఏడాది జాతీయ ఉత్తమ సేవా పురస్కారం పొందిన 'చేయూత' సంస్థ కార్యకలాపాల గురించి అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో పాత్రికేయులంతా అక్కడికి విచ్చేశారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న ఆ ఆశ్రమం నిర్వాహకులు శ్రీ అనంతానందని ఇంటర్వ్యూ చేసి ఆ ఆశ్రమం కార్యకలాపాల్ని అందరికీ తెలియజేయడానికి వారు సిద్ధంగా ఉన్నారు.

''అనంతానంద గారూ! ఈ ఏడాది ఉత్తమ పురస్కారం అందుకున్న 'చేయూత' ఆశ్రమాధిపతిగా మీ స్పందన తెలియజేస్తారా?'' అన్న పాత్రికేయుల ప్రశ్నకు ఆయన నవ్వుతూ బదులిచ్చారు.

''నిస్వార్థంగా సేవచేయాలనుకునే సంస్థలకిది స్ఫూర్తినిచ్చేదిగా ఉంటుంది. అంతేగానీ మేమేదో సాధించామని అనుకోవడం లేదు. జీవితంలో ఎన్నో డక్కామొక్కీలు తిన్న ఎందరో వృద్ధులకు మేమి

ప్పుడు సాంత్వన చేకూరుస్తున్నాం. వారి శేషజీవితాన్ని ఎంతో ఆనందంగా, ఆహ్లాదకరంగా, ఆరోగ్యంగా గడపడానికి దోహదం చేస్తున్నాం. ఈ క్రమంలో మాకు ఎంతోమంది వ్యక్తులు తమ సేవలు అందజేశారు. మాకొచ్చిన ఈ అవార్డు సమష్టి కృషి ఫలితం'' అంటూ ఆయన బదులిచ్చారు.

''ఇప్పటికే చాలా ఆశ్రమాలున్నాయి కదా! అయితే వాటికీ మీకూ తేడా ఏంటి?''

''నిజమే మన రాష్ట్రంలో అనేక ఆశ్రమాలు ఉన్నాయి. అయితే వాటికీ, మాకూ తేడా ఎంతో కన్పిస్తుంది. మేం చేసే సర్వీస్‌కూ , మా ఆశయాలు అందరికంటే భిన్నంగా ఉంటాయి. వృద్ధుల నుంచి ప్రతి నెలా ఎలాంటి రుసుం వసూలు చేయం. నెల మొదటి వారంలో ఎవరి స్థోమతకు తగ్గట్టుగా వారు ఆశ్రమ హుండీలో వేస్తారు. దాన్ని ఆశ్రమ అవసరాలకు వాడుతుంటాం. ఎవరు ఎంత వేశారనేది మాకే కాదు ఎవ్వరికీ తెలియదు. ఎవరైనా దాతలు ఇచ్చిన మొత్తాన్నైనా అందులోనే వేస్తాం''

''ఎక్కడో కథలోలా అందరూ పాలు పోస్తున్నారు కదా నేను నీళ్ళు పోసినా తెలియదు అన్నట్టుగా ఇక్కడ ఎవరికి వారు డబ్బులేయకుండా ఉంటే!''

''మీ ప్రశ్న సమంజసమైనదే. అయితే ప్రతి ఒక్కరికీ ఆత్మసాక్షి ఉంటుంది. ఈ వయసులో కూడా ఇలాంటి తప్పులు చేస్తారని మేం అనుకోవడం లేదు. వారు అలా చేసినా మేం ఎవ్వరినీ తప్పుపట్టం'' అన్నారు ఎంతో ప్రశాంతంగా.

''ఇలాంటి ఆశ్రమం ఏర్పాటుచేయడానికి మాకు ఎన్నో పరిస్థితులు దోహదం చేశాయి? అందుకు మా మిత్రులంతా ఎంతో సాయం అందించారు'' అంటూ ఆయన గతంలోకి వెళ్లిపోయారు.

****

ఆచంట నుంచి అమెరికాకి వెళ్ళిపోయిన కొందరు మిత్రులంతా ప్రతి వారం కలుసుకుంటూ ఉండేవారు. వారు తల్లిదండ్రులంతా తాము పుట్టిన ప్రాంతం నుంచి కదలలేమని చెప్పడంతో ఫ్యామిలీస్‌తో సహా వారు అమెరికాకి వెళ్ళిపోయారు. అంతకుముందు కేవలం స్టడీ కోసం హెచ్ - 1 వీసా సాధించిన వారు అమెరికన్ జీవనశైలికి అలవాటు పడిపోయి ఆ తర్వాత ఆదేశ పౌరసత్వం కోసం అప్లై చేసి ఎన్నో పరీక్షల్ని ఎదుర్కొని చివరికి గ్రీన్‌కార్డు సంపాదించి అమెరికన్ సిటిజన్స్‌గా మారిపోయారు.

అలా ఫారెన్ జీవితానికి అలవాటు పడిపోయారు మిత్రులంతా. ఏవో పండుగలకో, అత్యవసర సందర్భాల్లో తప్పితే ఎప్పుడూ వారికి ఆచంట గుర్తుకు వచ్చేది కాదు. ఒక్కోసారి గుర్తుకు వచ్చినా కొన్ని అనివార్యకారణాల వల్ల వారు స్వదేశానికి రాలేకపోయేవారు.

రోజుకి సుమారు పద్దెనిమిది నుంచి ఇరవై గంట వరకూ కష్టపడే ఈ ప్రవాసభారతీయులకు భార్యాపిల్లలు, వారి చదువులు, తమ ఉద్యోగ బాధ్యతలు తప్పితే స్వదేశంలో ఉన్న తమ కన్నవారి గురించి ఆలోచించే తీరిక, ఓపిక ఉండేవి కావు. అప్పుడప్పుడూ వారి తల్లిదండ్రులు ఇక్కడికి వచ్చినా వాతావరణానికి అలవాటు పడలేక తిరిగి తమ స్వస్థలాలకు వెళ్ళిపోయేవారు.

ఎప్పుడైనా తమ తల్లిదండ్రుల దగ్గరికెళ్ళి కొంత కాలం గడపాలన్నా ఇక్కడ విలాస జీవితాన్ని తలచుకుని, స్వదేశంలో సౌకర్యాలలేమిని గుర్తుకు తెచ్చుకుని ఆ ప్రయత్నానికి చరమగీతం పాడేవారు.

పిల్లల చదువులు, వారి ర్యాంకులు, తమ డ్యూటీలు వెరసి అమెరికాలో భారతీయుల జీవితం రోజురోజుకీ వేగవంతం అయి యాంత్రికతకి అలవాటు పడిపోతోంది.

పెళ్ళైన కొత్తలో ఆచంట నుంచి అమెరికాకి వెళ్లిన రామారావు అక్కడ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం సంపాదించుకుని డాలర్లు వెనకేసుకుంటూ భార్యను కూడా అక్కడికి తీసుకెళ్ళిపోయాడు.

అలా అమెరికాకి వెళ్లిన రామారావు దంపతులు ఇద్దరు పిల్లలకి జన్మనిచ్చారు. ఇద్దరి పెంపకం, ఉద్యోగ నిర్వహణాబాధ్యతలతో వారికి క్షణం తీరిక లేకుండా పోయింది.

వారితో పాటూ అమెరికాకి వచ్చిన ఇతర మిత్రుల పరిస్థితిలో కూడా ఎలాంటి మార్పులేదు. యంత్రాలతో సమానంగా పనిచేస్తూ ఉన్న ఉద్యోగానికి తోడు, పార్ట్‌టైం జాబ్‌లు చేస్తూ డాలర్లని పెంచుకుంటూ విలాసవంతమైన జీవితానికి బానిసలైపోయారు.

విదేశాల్లో ఉన్న మన సంప్రదాయానికి విలువనిస్తూ పెద్ద పెద్ద పండుగలకి అంతా కలుసుకుంటూ తమ ప్రత్యేకతని చాటుకుంటూండేవారు. తల్లిదండ్రుల ఆరోగ్యం బాగాలేదన్నా వారికి ఎంతో కొంత డబ్బు పంపడం తప్ప వారిని స్వయంగా పరామర్శించే అవకాశం వారికి లేదు.

ఆచంటలో ఉన్న రామారావు తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఉత్తరం వారి జీవనశైలిని మార్చేసింది. వీరితో పాటూ అమెరికాలో ఉన్న ఇతర భారతీయ కుటుంబాల వారిమీద కూడా ఈ ఉత్తరం ప్రభావం కన్పించింది.

****


కొడుక్కి దూరంగా ఉన్న రామారావు తల్లిదండ్రులు కొడుకుని, కోడల్ని, మనవల్ని చూడాలని వృద్ధాప్యంలో ఉన్న తమకోసం ఒక్కసారైనా రావాలని ఎంతగానో ప్రాధేయపడ్డారు.

''బాబూ రామారావూ!''

దీవెనలతో మీ అమ్మ రాయునది. నీ రాకకోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నాం. మీ నాన్నగారి ఆరోగ్యం ఏ మాత్రం బాగాలేదు. నీవు ఒకసారి కోడలు పిల్లతో కలిసి వచ్చి వారంరోజులు ఉండి వెళితే బాగుంటుంది. ఆయన చిక్కిశల్యమైపోయారు. నీ రాకకోసం ఎదురుచూస్తున్నాం'' అంటూ తల్లి రాసే ఉత్తరాలకి రామారావు ఫోన్ కాల్స్ సమాధానం ఇచ్చేవి.

''అమ్మా! ఇక్కడి పరిస్థితులు నీకు తెలియనివి కావు. ఒక్కసారి రావడం అంటే ఎంతో కష్టం. పిల్లల చదువులు, మా ఉద్యోగ బాధ్యతలతో అది సాధ్యంకాదు. డబ్బు పంపిస్తున్నాను. నాన్నగారిని మంచి ఆస్పత్రిలో చూపించండి. ఇప్పుడు రాలేకపోతున్నందుకు క్షమించండి'' అంటూ కొడుకు మాటలు విని కొంత సంతోషించడం తప్ప ఆ వృద్ధ దంపతులు సంతోషపడే సందర్భాలు ఏవీ కన్పించేవి కావు.

'ఫోన్‌కాల్స్, ఉత్తరాలు ఆ తల్లిదండ్రులకు ఏమాత్రం సంతృప్తిని ఇస్తాయి? స్వంత మనిషి దగర లేకుండా ఇలాంటి ఉత్తరాల ఊరడింపులు, ఫోన్‌కాల్స్ పలకరింపులు ఏమాత్రం ప్రయోజనాన్ని ఇస్తాయి? కన్నవారికి తాము కన్నవారు దగ్గరుంటేనే కొండంత అండ. అయితే ఈ విషయాన్ని



ఎంతమంది ఆలోచిస్తారు' అని తనలోతాను మధనపడేది రామారావు తల్లి.

అలా తల్లి రాసే ఉత్తరానికి ఫోన్‌కాల్స్‌తో సమాధానం ఇస్తూ కాలాన్ని వెళ్ళదీసేవాడు రామారావు.

ఒకరోజు అనుకోని ఫోన్‌కాల్ రామారావుని ఆలోచింపచేసింది.

''ఫాదర్ ఎక్స్‌పైర్డ్...స్టార్ట్ ఇమ్మీడియెట్లీ'' అంటూ వచ్చిన టెలిగ్రాం రామారావుని శోక సంద్రంలో ముంచేసింది.

భార్యపిల్లల్ని తీసుకుని రావడం కుదరక వెంటనే ఇండియాకి బయలుదేరి వచ్చాడు రామారావు. ఆ తర్వాత పిల్లలతో ఆచంటకి వచ్చింది రామారావు సతీమణి.

రామారావు వచ్చేసరికి తండ్రి దహనక్రియలు జరిగిపోయాయి. రామారావు బాబాయి కొడుకు చేతుల మీదుగా ఈ కార్యక్రమాలు జరగిపోవడంతో రామారావు ఏమీ అనలేకపోయాడు. అయితే మనసులో మాత్రం తండ్రి రుణం తీర్చుకోలేకపోయాననే అన్న బాధ మాత్రం అతనిలో ఉండిపోయింది. క్యాన్సర్ వ్యాధితో బాధపడిన రామారావు తండ్రి చనిపోయి అప్పటికే నలభై ఎనిమిది గంటలు దాటిపోవడంతో దహన క్రియలు జరపడం అనివార్యం అయిందని పెద్దలు చెప్పడంతో 'కన్నకొడుకు' లేకుండానే అసలైన కార్యక్రమం జరిగిపోయింది.

ఇది తెలిసి రామారావు తల్లి రాజేశ్వరి ఎంతో బాధపడింది.

పుత్రుడు పున్నామనరకం నుండి తప్పిస్తాడనుకుంటే ఎక్కడో విదేశాల్లో ఉండి అసలు కార్యక్రమం అనంతరం రావడం ఆమెని ఎంతో బాధించింది.

అయినా కొడుకుని ఏమీ అనలేకపోయింది.

మిగిలిన కార్యక్రమాలకైనా వచ్చాడని ఆ తల్లి సంతోషించింది.

చాలా ఏళ్ల తర్వాత కొడుకుని చూసిన సంతోషంతో ఆ తల్లి కొడుకు ఒడిలో తలవాల్చి పడుకుంది. అయితే ఆమె తిరిగి లేవలేదు.

భర్త పోయిన దుఃఖం ఆమెకి తీరని వ్యధని కలుగజేసింది. బలహీనంగా మారిన ఆమె గుండె ఇక నేను కొట్టుకోలేనన్నట్టుగా పూర్తి విశ్రాంతిని కోరుకుంది. తండ్రి చనిపోయిన నాలుగురోజులకే తల్లి కూడా ఆయన దగ్గరకి చేరిపోయింది.

కొడుకుని చూశాను. ఇక తానేమైపోయినా ఫర్వాలేదనే సంతృప్తి ఆమె కళ్ళల్లో కనిపించింది.

తండ్రి చివరి చూపునకైనా నోచుకోని రామారావు తల్లితో రెండురోజులు గడిపినందుకు సంతోషించాలో, తల్లి తన ఒడిలో చివరి శ్వాస విడిచినందుకు బాధపడాలో అర్థంకాని సందిగ్ధ పరిస్థితిలో ఉన్నాడు.

తల్లికి జరగాల్సిన ఉత్తర క్రియల్లో పాల్గొన్న రామారావు కళ్లల్లో కన్నీరు ఇంకిపోయింది.

నవమాసాలు మోసి, ప్రాణాల్ని లెక్కచేయకుండా కనిపెంచే తల్లిదండ్రుల్ని ఆ క్షణంలో తలుచుకోకుండా ఉండలేక పోయాడు రామారావు. ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే ప్రతి తల్లిదండ్రుల వృద్ధాప్యం ఇంత దారుణంగా ఉంటుందా? అన్పించింది రామారావుకి.

ఇతర దేశాల్లోనే కాదు, ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే తల్లిదండ్రులకి ఇలాంటి శోకం తప్పడం లేదని అతనికి స్వయంగా అనుభవిస్తే గానీ తెలియలేదు.

తల్లిదండ్రుల ఉత్తరక్రియలన్నీ ముగించుకుని అమెరికాకి పయనమయ్యాడు రామారావు విషణ్ణ వదనంతో...అయితే అలా వెళ్ళేటప్పుడు ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఆ నిర్ణయం అతనితో పాటూ ఆంధ్రా నుంచి అమెరికాకి వెళ్ళిన ఇతర భారతీయుల జీవితాల్ని కూడా మార్చేస్తుందని ఆ టైంలో రామారావు ఊహించలేకపోయాడు.

****

రామారావు కొడుకు ఆనంద్ పెద్దవాడయ్యాడు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన కొడుక్కి ఆస్ట్రేలియాలో ఉద్యోగం రావడంతో అమెరికానుంచి ఆస్ట్రేలియాకి తన మకాం మార్చాడు. తరచూ తల్లిదండ్రుల్ని చూడడానికి వచ్చినా ఎక్కువ కాలం వారితో గడపలేకపోయేవాడు.

ఈ సంగతి గురించే తల్లిదండ్రులు కొడుకులతో ప్రస్తావించేవారు. ''బాబూ! మనకున్న సంపద సరిపోతుంది. అక్కడికెళ్ళద్దురా'' అంటూ బ్రతిమిలాడేవారు.


అయితే ఉద్యోగబాధ్యతలు వారికి తెలుసు కాబట్టి కొడుకుని ఏమీ అనలేకపోయేవారు. కొడుకు కెరీర్‌కి ఎలాంటి ఆటంకాలు కలిగించలేకపోయారు. ఇలాంటి పరిస్థితి తన తల్లిదండ్రులకి కూడా కలిగిందని రామారావుకి కొంతకాలం తర్వాత గానీ అవగతం కాలేదు. తనదాకా వస్తే... అనేది ఇప్పుడు అర్థం అవుతోంది రామారావుకి. కొడుకు దూరంగా ఉండడంతో మానసికంగా వారు బాధపడసాగారు. వయసు పెరగడంతో వచ్చే వ్యాధులు కూడా వారిని కృంగదీయసాగాయి. రోజురోజుకీ వారిలో మార్పులు సంభవించాయి.

ఈ సందర్భంలోనే ప్రవాస భారతీయులంతా ఓ ఉత్సవం జరుపుకున్నారు. అమెరికాలో ప్రత్యేకంగా ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన వారంతా ఆ ఉత్సవంలో ప్రధాన భూమిక నిర్వహించారు. ఎవరికి తోచినట్టుగా వారు ప్రసంగిస్తూ అమెరికాలో తమ తమ అనుభవాలను సభికులతో పంచుకున్నారు. అందులో పాల్గొన్న రామారావు చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.

''మనం ఎంతగా సంపాదించినా మన ఆత్మీయులకు దగ్గర లేకుండా ఉండడం నిజంగా నరకమే. నేను కెరీర్ గురించి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న అమెరికాకి వచ్చినప్పుడు నా తల్లిదండ్రులు అనుభవించిన మానసిక సంఘర్షణ నాకు గుర్తుంది. అలాంటి సంఘర్షణ మళ్ళీ నాకు కలగకూడదు. అలాగే మీకు కూడా కలగకూడదనుకుంటున్నాను. వృద్ధాప్యంలో మనమంతా సంతోషంగా ఉండాలి. అప్పుడే మనం ఇప్పుడు పడ్డ కష్టానికి సార్థకత లభిస్తుంది. ఈ మధ్య అలాంటి అనుభవమే నాకు కలుగుతోంది. రాత్రంతా నేను ఆలోచిస్తే నాకో ఆలోచన తట్టింది. వృద్ధాప్యంలో కూడా ఆనందమయ జీవితాన్ని అనుభవించలేమా? అందుకు మనం చేయాల్సింది ఏంటి? అని ఆలోచించాను. ఆ ఆలోచన పరంపరలోంచి ఓ కొత్త ఆలోచన రూపుదాల్చింది. అది మీ ముందుంచుతున్నాను'' అంటూ తన ప్రతిపాదనని ప్రవాస భారతీయుల ముందు ఉంచాడు రామారావు.

కాసేపంతా ఆలోచించాక వృద్ధాప్యంలో ఆనందమయ జీవితాన్ని అనుభవించేందుకు ప్రత్యేకంగా ప్రవాస ఆంధ్రులంతా నడుం బిగించారు.

రామారావు చెప్పినట్టుగా అంతా ఓ ఫండ్ ఏర్పాటు చేయడానికి సంకల్పించారు. ఆ సమావేశంలోనే ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చింది. తమ దగ్గరున్న మొత్తాన్ని ఓ హుండీలో వేశారు. చెక్కులు చేతిలో ఉన్నవారు చెక్కులిచ్చారు. 'చేయూత చారిటబుల్



ట్రస్ట్' అలా వాస్తవ రూపం దాల్చింది. ఈ ట్రస్ట్ కార్యకలాపాలకు వేదికగా అంతర్జాతీయంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ని ఎంచుకున్నారు. హైదరాబాద్ శివారున ప్రశాంతమైన వాతావరణం ఉన్న చోట పదెకరాలు కొనుగోలు చేశారు. ఆ పదెకరాల్లో దశలవారీగా ఆశ్రమానికి తగిన వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. విదేశాల్లో నివశిస్తూ వృద్ధాప్యంలో ఒంటరితనాన్ని అనుభవించే వారు ఇక్కడే సేదతీరవచ్చు. ఎంతకాలం అంటే అంత కాలం ఉండవచ్చు. ప్రవాసాంధ్రుల ఆర్థిక సాయంతో ఏర్పాటైన ఈ ఆశ్రమం ఇతర ఆశ్రమాలకి మార్గదర్శిగా ఉండాలని భావించారు. అందుకు తగ్గట్టుగా వీరంతా తగిన కృషి చేశారు.

అనారోగ్యం బారిన పడిన వారిని ఆదుకునేందుకు ఆ ఆశ్రమంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఆశ్రమం నిర్వహణ అంతా రామారావు తన భుజస్కంధాలపై వేసుకున్నాడు. అలా ఆ ఆశ్రమం ఆలోచన కార్యరూపం దాల్చింది 'చేయూత'గా వాస్తవరూపానికి వచ్చింది. ట్రస్ట్ కార్యకలాపాల్లో బిజీగా ఉంటూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేశాడు రామారావు. ఫలితంగా రామారావు అనారోగ్యం బారినపడి కొన్నాళ్ళకే కన్నుమూశాడు.

అయితే వెళ్ళేముందు కొడుకుని ఆస్ట్రేలియా నుంచి పిలిపించి జరిగిన సంగతులన్నీ పూసగుచ్చినట్టుగా వివరించాడు. కొడుకు స్పందన కోసం నిరీక్షించాడు.''నాన్నగారూ! మీ ఆవేదన నాకు అర్థమైంది. ఈ ఆశయసిద్ధి కోసం నేను అవిరళకృషి చేస్తాను. మీరు నిశ్చింతగా ఉండండి'' అంటూ ఆనంద్ తండ్రికి హామీ ఇచ్చాడు.

తండ్రికిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి తానేం చేయాలో ఓ ప్లాన్ ఆలోచించాడు. చిరకాలంగా ఆయన కలలు గన్న 'చేయూత' ఆశ్రమాన్ని ఉత్తమ ఆశ్రమంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నాడు. ఆస్ట్రేలియాలోని ఉద్యోగానికి రాజీనామా చేసి అమెరికాలోని ఆస్తి పాస్తుల్ని అమ్మేసి, తల్లిని తీసుకుని ఇండియాకి వచ్చేశాడు తండ్రి ఆశయం సిద్ధికోసం.

ఇండియాకి వచ్చాక తన స్వగ్రామంలో పెద్ద ఇంటిని నిర్మించి తన తాత, నాన్నమ్మ, తండ్రికి గుర్తుగా ఆ ఇంటిని తీర్చిదిద్దాడు. హైదరాబాద్‌కి సమీపంలో నిర్మించిన 'చేయూత' ఆశ్రమాన్ని మోడల్ ఆశ్రమంగా తీర్చిదిద్దేప్రయత్నంలో నిమగ్నమయ్యాడు.

తల్లికి నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని తన పేరుని అనంతానందగా మార్చుకున్నాడు. ఆ పేరుకి తగ్గట్టుగా అనంతానంద ఎప్పుడూ ఆనందంగా కన్పించేవాడు. చెరగని చిరునవ్వు, ఏ కోశానా కన్పించని విసుగు అనంతానందని పదిమందిలో ఉన్నతవ్యక్తిగా మార్చేశాయి.

అనంతానందకి ఎప్పుడూ తన తండ్రికిచ్చిన మాటే గుర్తుకువచ్చేది. అతే కాదు చిన్నప్పుడు చూసిన తాతయ్య రూపం మదిలో మెదిలేదు. వృద్ధాప్యంలో ఎవరూ ఎలాంటి ఇబ్బందులు పడకూడదని, సంతోషంగా, ఉల్లాసంగా కాలం గడపాలని భావించేవాడు. దానికి తగ్గట్టుగా వృద్ధాప్యానికి చేరువుతూ ఇతర దేశాల్లో అయినవారికి దూరంగా బిక్కుబిక్కుమంటూ జీవించే వారికి 'చేయూత' ఓ ఆలంబన కావాలని భావించాడు.

పెళ్ళిళ్ళు, పుట్టినరోజులు, బారసాల వంటి ఆనందకరమైన రోజులు ఈ ఆశ్రమంలో చేసుకునే అవకాశం కల్పించాడు అనంతానంద. ఇక్కడ ఉన్నంతకాలం ఎవరూ తాము వృద్ధులమని, తమకెవరూ లేరనే బాధలేకుండా వారికి మంచి మంచి వ్యాపకాలు కలుగజేశాడు.

ఆరోగ్యానికి ఎలాంటి ఢోకా లేకుండా మంచి వాతావరణం కల్పించాడు. ఎవరు చేయదగిన పని వారికి కల్పించి ఆశ్రమాన్ని మనస్పర్థలకు అవకాశం లేని ఓ కటుంబంగా మార్చేశాడు.

చేయూతలో ఉండే వృద్ధులు మునుపటికంటే ఎంతో ఆరోగ్యంగా ఉండడం గమనించాడు అనంతానంద. విదేశాల్లో ఉన్న వృద్ధులు ఇక్కడ తమకు ఆశ్రమం కావాలంటూ దరఖాస్తులు రావడం వాటిని పరిశీలించి వారిని చేయూతకి ఆహ్వానించడం ఎక్కువైపోయింది.

అలా చేయూత ఓ ఆదర్శ ఆశ్రమంగా మారిపోయింది. చేయూతని నడిపేందుకు కావలసిన మొత్తం అంతా సభ్యుల విరాళాల రూపంలోనే లభించేది. పిల్లలకివ్వగా మిగిలిన కోట్లాది రూపాయల్ని ఆ వృద్ధులంతా ఆశ్రమానికి ధారాదత్తం చేశారు. ఆ ఆశ్రమం ఎన్నాళ్లైనా ఇబ్బందులు లేకుండా నడవాలన్నదే వారి ఆశయం.

****

గతంనుంచి వర్తమానంలోకొచ్చారు అనంతానంద. తిరిగి వర్తమానం నుంచి భవిషత్తులో తానేం చేయలనుకుంటున్నదీ అనంతానంద వివరించారు. రాష్ట్రపతి నుంచి ఉత్తమ పురస్కారం అందుకున్న తర్వాత అనంతానంద తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. రోజురోజుకీ మారిపోతున్న మానవసంబంధాల్లో ఆత్మీయత, అనురాగం, సేవానిరతి మరింతగా వృద్ధిచెందాలంటే ఇలాంటి ఆశ్రమాలు ఎంతో అవసరం అని రాష్ట్రపతి తన ప్రసంగంలో చేయూతకి అభినందనలు అందజేశారు.

పత్రికల్లో వార్తలు చదివిన వృద్ధులంతా ఇలాంటి ఆశ్రమాలు ఇంకా ఎన్నో కావాలని కోరుకున్నారు. తమ వృద్ధాప్యాన్ని ఇంత ఆనందంగా, ఆహ్లాదంగా గడిపే అవకాశం ఉన్నందుకు ఎంతో సంతోషించారు. భవిష్యత్తులో రాబోయే తమ వృద్ధాప్యాన్ని ఆనందంగా ఆహ్వానించేందుకు వారు వేయికళ్ళతో ఎదురుచూస్తున్నారు.

ఇప్పుడు చేయూత తన శాఖలను రాష్ట్రమంతటా విస్తరించాలనే సంకల్పంతో అడుగులు ముందుకేస్తోంది వృద్ధుల జీవితాల్లో కొత్త ఆశలు నింపుతూ.

*

